# చిరకానుక

దొగ్గా సాయిచంద్రశేఖర్

నన్ను నా ప్రేమని కాదని వెళ్ళిపోయిన భారతి నా పెళ్ళయిన మూడవ నెల్లో ఓ అర్ధరాత్రి నా ఇంటి తలుపు తట్టింది.

అందానికి నిర్వచనం భారతి, ప్రేమకు వ్యక్తిత్వానికి నిర్వచనం భారతి, సకల గుణాలు కల్గి ఉన్న అందాల నా ప్రియురాలు భారతి దాదాపు అయిదు సంవత్సరాలు నాతో ప్రేమ ప్రయాణం చేసి నన్ను కాదని వెళ్ళిపోయింది. ఎందుకో ఇప్పటికీ నాకు తెలియదు.

ఆమెను మరచిపోవడం ఇప్పటికీ నావల్ల కావటంలేదు. క్షణం క్షణం ఆమె రూపం కళ్ళ ముందు కదలాడుతూ నన్ను హింసిస్తూనే ఉంది. కానీ భావనని చేసుకున్న మూడవ రోజు నుండీ భారతిని కొద్ది కొద్దిగా మరిచిపోవడానికి ప్రయత్నం ప్రారంభమయ్యింది. భావన నిజంగా నాకు భార్యగా లభించడం అదృష్టమే! పసిపిల్లవాణ్ణి చూసుకున్నట్టు నన్ను చూసుకుంటుంది. ఆమె లాలనలో మెల్ల మెల్లగా భారతిని మరిచిపోతున్నా!

హఠాత్తుగా భారతి రావడం నాకు ఆశ్చర్యం కల్గించింది. నాతోపాటు శ్రీమతి కూడా లేచివచ్చింది. బ్రీఫ్ కేస్ చేత్తో పట్టుకుని భీతహరిణిలా ఉన్న ఆమెను లోనికి ఆహ్వానించింది. లోపలికి వచ్చీ రావడంతోనే సోఫాలో కూలబడిపోయింది. ఒకప్పటి నా ప్రేమ దేవత వన్నె తగ్గిన శిల్పంలా ఉంది.

''భారతీ! ఏమైందీ నీకు'' అంటూ నా శ్రీమతి పలకరిస్తుంటే ఆశ్చర్యపోయా! వీరిద్దరి పరిచయం ఏమిటా అని.

''చూడండి! వళ్ళు పెనంలా కాలిపోతుంది'' అంది. గబగబా ఆమె చెయ్యి పట్టుకుని నాడి చూసాను. బలహీనంగా కొట్టుకొంటోంది. తిండి తిని ఎన్ని రోజులో అయినట్లుంది ఆమె ముఖం చూస్తుంటే.

శ్రీమతిని ముందు ఓ గ్లాసుడు పాలు తెమ్మని చెప్పా! నా మెడికల్ కిట్‌లోనుండి యాంటి బయోటిక్స్, పేరసిట్మాల్, బికాంప్లెక్స్ తీసి ఇచ్చి పాలు త్రాగిన తరువాత వెయ్యమని శ్రీమతికి పురమాయించా! మౌనంగా ఉన్న భారతిని చూస్తుంటే నా గుండె లోతుల్లో పూడుకున్న గాయాలు మళ్ళీ రేగుతున్నాయి.

''రేపు ఉదయం హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాలి. మీరు వెళ్ళి తొందరగా పడుకోండి! భారతిని నేను చూస్తుంటాను'' అంది శ్రీమతి.

నా జీవితంలో ఆమె వెన్నెల లేని ఎన్ని నిద్రలేని రాత్రులు గడిచాయి. ఆ లిస్టులో ఈ రాత్రి కూడా చేరుతుంది. అందాల నా ప్రేమ శిల్పం ముక్కలైపోతుంటే నాకు నిద్ర ఎలా వస్తుంది.

మెలకువగానే ఉన్నాను చల్లని ఎ.సి. గాలులు వీస్తున్నా! చిరుచెమటలు పోస్తున్నట్లుంది నాకు. 3 గంటలవుతుండగా నా శ్రీమతి కంగారుగా పిలిచింది. లేచి వెళ్ళాను.

భారతి గుండెలమీద చేత్తో నొక్కుకుంటూ మెలికలు తిరిగిపోతుంది. ''గుండె నొప్పి ఏమో! కార్డియాలజిస్టుని సంప్రదిస్తే బావుంటుంది కదా!'' అంది నా శ్రీమతి.

పెద్ద మెడికల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ సేల్స్ ఆఫీసర్ అయిన నాకు దాదాపు సిటీలో ఉన్న డాక్టర్స్ అందరూ సన్నిహితులే. కార్డియాలజిస్ట్ చలపతిరావుగార్ని సంప్రదిస్తే బావుంటుంది అన్పించింది. వెంటనే ఆయన రెసిడెన్స్‌కి ఫోన్ చేసా! మేడమ్ లైన్‌లోకి వచ్చారు.

''ఎమర్జెన్సీ కేసు ఏదో వస్తే ఇప్పుడే క్రిందకి దిగారు మిస్టర్ రాహుల్. ఇంటర్‌కమ్‌లో పిలవనా క్రిందికి ఫోన్ చేస్తారా.'' అందామె.

''లేదు మేడమ్! అక్కడికే రావాలి. థాంక్స్.'' అని ఫోన్ పెట్టేసాను.

షెడ్‌లోంచి కారు బయటకు తీసా! శ్రీమతి సహాయంతో భారతిని వెనక సీట్లో పడుకోబెట్టాను. ఆమె తల ఒళ్ళో పెట్టుకుని కూర్చుంది నా శ్రీమతి. కారు వేగంగా హాస్పిటల్‌వైపు పోనిచ్చాను.

ఎమర్జెన్సీ వార్డ్‌లో ఎడ్మిట్ చేసారు భారతిని. చలపతి రావుగారికి వివరంగా చెప్పాను ఆమె మాకు ఆప్తురాలని.

అప్పుడు తీసింది శ్రీమతి బ్యాగ్‌లో నుండి భారతికి సంబంధించిన మెడికల్ రిపోర్ట్స్. నేనాశ్చర్యంగా చూస్తుండగానే డాక్టర్‌గారికి అందించింది. నావంక చూస్తూ డాక్టర్‌గారు రిపోర్ట్స్ అందుకుని పరీక్షగా చూసి, ''ఇప్పటికే చాలాకాలం నెగ్లెక్ట్ చేసారు. ఆపరేషన్ చేసి ప్రయత్నిద్దాం!'' అన్నారు.

''నిమ్స్‌కి తీసుకు వెళ్ళమంటారా? డాక్టర్'' అన్నాను.

''మీరు వెంటనే ఇంటికి వెళ్ళి కాసేపు రెస్ట్ తీసుకుని ఉదయం 8 గంటలకు రండి. ప్రోగ్రాం నేను ఎరేంజ్ చేస్తాను.'' అన్నారు. భారతిని చూసుకోవడానికి అప్పటికే నలుగురు సిస్టర్స్ ఉన్నారు. ఫరవాలేదనిపించి ఇంటికి బయలుదేరాం.

''భారతి ఎవరని అడగరేం'' అంది నా శ్రీమతి. నాకథ ఆమెకు తెలియదు అనుకున్నాను. ఆమె నాకోసం రాలేదు అని అర్థమైంది. చెప్పమన్నట్లు శ్రీమతి వంక చూసాను.

''స్వయానా మా పెద్దమ్మ కూతురు. మీరు చదివిన కాలేజీ ప్రక్కనే ఉన్న ఉమెన్స్ కాలేజీలో చదివింది. భారతితో నన్నెప్పుడైనా చూసారా!'' అంది శ్రీమతి.

లేదన్నట్లు తల అడ్డంగా తిప్పాను.

''మీరందరూ కొడైకెనాల్ వెళ్ళినప్పుడు మధ్యలో బస్సు ఆపి మీతో చేరింది నేనే! భారతి కోసం మీరు ఆ కొండ శిఖరాన్ని చేరి తిరిగి రాకపోతే నేను మీ ఫ్రండు జగన్నాథం కలసి మీకోసం వచ్చాం అదన్నా గుర్తుందా?'' అంది.

''ఆకొండమీద ఉన్న బంటరాయి మీద నాపేరు ముందుగా ఎవరు చెక్కుతారో, అతన్నే పెళ్ళిచేసుకుంటా!'' అన్న భారతి గొంతు నా స్మృతి మెదిలింది.

కానీ భారతి రూపం తప్ప అప్పట్లో ఆడపిల్లలెవరూ నాకు తెలీదు. కన్నెత్తి చూసేవాణ్ణికాదు. ''గుర్తుంది కానీ నువ్వని తెలియడంలేదు'' అన్నాను.

నా అనుమానాలకు సమాధానంగా ''నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడానికి భారతే కారణం'' అంది. నన్ను ఆశ్చర్యంలో మరోసారి ముంచెత్తింది.

''మీరు డిగ్రీ ఫైనలియర్‌లో ఉండగా ఒకసారి భారతి బెంగుళూరు వచ్చింది. ఆరోజు నాకు పెళ్ళి చూపులు. 'అది ఆపించడానికే వచ్చాను' అంది. నేను ఆశ్చర్యంగా ఏమిటా విషయం నాకు కాబోయే మొగుణ్ణి కూడా ప్రేమించావా! అన్నాను.

అప్పుడు చెప్పింది మీ ప్రేమకథ. భారతి లేనిదే మీరు బ్రతకలేరట. అంతటి ప్రేమనైనా అందించే భార్యనైనా మీకు ఇవ్వాలని నాకు ఆమె ప్రోబ్లం చెప్పింది.''

తొందరగా చెప్పు అన్నట్లు చూసాను.

''అప్పుడప్పుడు గుండె నొప్పి వస్తుందట. ఓసారి స్కానింగ్ తీయించుకుందట. హార్ట్‌లో చిన్న హోల్

వుందని టెస్ట్‌లో బయటపడిందట. సర్జరీ చేయించడానికి దాదాపు రెండు లక్షలపైనే కావాలట.

ఆమెను పిచ్చిగా ప్రేమించిన వాళ్ళ బావ మీ ప్రేమకథ తెలిసి ఆ కసితో వాళ్ళ నాన్నగారి బిజినెస్ అంతా లాస్ చేయించి ఇంటికి పంపించారట. ఆమె బ్రతకాలంటే కావలసిన డబ్బు మాకుటుంబంలో ఎవరిదగ్గరా లేదు. ఉన్న బావ శత్రువయ్యాడు. మీ పరిస్థితి కూడా చెప్పింది. మీ ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళి చెయ్యవలసిన బాధ్యత మీ మీద ఉండగా తాను మీకు భార్యయై మీకు భారమవడం ఇష్టంలేక నన్ను పెళ్ళికి ఒప్పించింది. ఆ తర్వాత సంగతి మీకు తెలిసిందే!''

నా భార్య మాటలు వింటున్నకొద్దీ నా గుండెలు బద్దలవుతున్నాయి. కంపెనీలో ఉద్యోగం వచ్చిన తరువాత నా ఆర్థిక స్థితి పూర్తిగా మారింది. కంపెనీవాళ్ళు కారు కూడా ఇచ్చారు. కావాలంటే రెండులక్షలు అప్పు కూడా ఇస్తారు. నా పరిస్థితి నా శ్రీమతికి తెలుసు కదా! ఈ విషయం ముందుగా ఎందుకు చెప్పలేదని అడిగాను.

``మీ ప్రాబ్లమ్స్ అన్నీ తీరింది మొన్న మొన్ననే కదండీ! ఇప్పుడు మీ స్థితి అర్థమయ్యే భారతిని ట్రీట్‌మెంట్ కోసం నేనే రమ్మని బలవంతం చేసా'' అంది. ఆమె ఉదారత్వానికి చేతులెత్తి నమస్కరించాలనిపించింది.

నాకు ఇంటికి వెళ్ళాలనిపించలేదు. కారు వెనక్కి తిప్పి వేగంగా హాస్పిటల్‌కి పోనిచ్చాను. చలపతిరావుగారు ఆశ్చర్యంగా చూస్తున్నారు. వెంటనే భారతిని నిమ్స్‌కు తీసుకువెళతానని చెప్పాను.

``మిస్టర్ రాహుల్ నాకు పుట్టపర్తి వెళ్ళాల్సిన ప్రోగ్రాం వుంది. నా ఫ్రెండ్స్ ముగ్గురు అమెరికా నుండి వస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి సాయిబాబా హెల్త్‌సెంటర్‌లో ఆపరేషన్స్ నిర్వహించి కొంత సేవ చేసామని తృప్తి మిగుల్చుకుంటాం. భారతిని అక్కడికి తీసుకువెళదాం! ప్రేయారిటీ లిస్టులో భారతి పేరు నువ్వెళ్ళగానే ఫోన్ చేసి పుటప్ చేయించా!'' అన్నారు.




``డాక్టర్! మా యం.డి.గారినడిగి ఎ.సి. వ్యాన్ ఏదన్నా ఎరేంజ్ చెయ్యమంటారా.'' అన్నాను. ``అలాగే కానీయ్!'' అన్నారు చలపతిరావుగారు.

శ్రీమతిని ఇంటి దగ్గర డ్రాప్ చేసి ప్రయాణానికి కావలసిన సరంజామా ఎరేంజ్ చెయ్యమని చెప్పి నేను యం.డి.గారి దగ్గరకు బయలుదేరాను.

అప్పటికే ఆయన మార్నింగ్ వాక్‌కి బయలుదేరబోతున్నారు. ``వాట్ మిస్టర్ రాహుల్ ఉదయాన్నే వచ్చేవ్ కమాన్ టెల్‌మి.'' అన్నారు.

నమస్కరించి, విషయం చెప్పాను. వినగానే లోపలికి తీసుకువెళ్ళి హాల్‌లో కూర్చోబెట్టి లోనికివెళ్ళారు. వ్యాన్ కీస్‌తోపాటు రెండు చెక్కులు తెచ్చారు. నాచేతికిస్తూ `అవసరాన్ని బట్టి వాడుకో'' అన్నారు.

హృదయపూర్వకంగా యం.డి.గారికి నమస్కరించి నాకారు అక్కడే వదిలి వ్యాన్ తీసుకుని ఇంటికి బయలుదేరాను.

కంగారుగా బయటకు వస్తున్న శ్రీమతి గేటులోనే ఎదురైంది. ``ఏంటి విషయం?'' అని కంగారుగా అడిగాను.

``మీకు చెప్పానే! భారతిని ప్రేమించిన బావ భారతి పరిస్థితి తెలిసి కోపంతో తాను చేసిన తప్పుకి చెయ్యి ఒకటి నరికేసుకున్నాడట. బెంగుళూరు నుండి మామయ్య ఫోన్ చేసారు. భారతికి విషయం తెలియజెయ్యమన్నారు. అందుకే హాస్పిటల్‌కి వెళదామని వస్తున్నాను.'' అంది.

``ఈ పరిస్థితిలో భారతికి ఈ విషయం తెలియకూడదు. ఆపరేషన్ అయి కోలుకున్న తరువాత



## అప్పు

ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుంటున్నారు-
''అప్పుగా డబ్బు తీసుకుని ఇవ్వడం లేదుగురూ.''
''గట్టిగా పోట్లాడి తీసుకోవచ్చుగా.''
''అయినా మాఆవిడ ఇవ్వదు.''

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు (జె.జె.నగర్)

## సలహా!


''డ్యాక్టరుగారూ... నేను నిద్రపోతున్నప్పుడు నాకు ఒకటే గురక వస్తుందండి. నా గురక్కి నాకే మెలుకువ వచ్చేస్తుంది కూడానూ. ఏం చేయమంటారు?'' అడిగాడు పేషెంట్ చంద్రశేఖర్ బాధపడుతూ.
''ప్రక్కగదిలో పడుకోండి ప్రశాంతంగా.'' చెప్పాడు డ్యాక్టర్.

- లకనం మూర్తి (కాకినాడ)

## శకునం

శకునాల పిచ్చి ఎక్కువగా ఉన్న రామనాధంగారు ఓ శాస్త్రిగారితో కలసి రోడ్డుమీద నడుస్తున్నారు. అంతలో వారికి ఎదురుగా ఓ కుక్క వస్తోంది.
''శాస్త్రిగారూ... ఇపుడు మన ఎదురుగా వస్తోన్న ఆ కుక్క మన కుడివైపు నుండి వెళ్తే మంచిదా? లేక ఎడమవైపు నుండి వెళ్తే మంచిదా?'' అనడిగాడు రామనాధం.
''మీదపడి కరవకుండా వెళ్తే చాలా మంచిది.'' ఠక్కున చెప్పారు శాస్త్రిగారు.

- గుత్తుల శ్రీనివాసరావు (దొంతికుర్రు)




చెబుదాం! పద లోపలికి.'' అన్నాను. అప్పుడుగానీ శ్రీమతికి గుర్తురాలేదు భారతి హార్ట్ పేషంటని. ''సారీ'' అంది.

నెల రోజులకు సరిపడా డ్రెస్సులు, భారతికి, శ్రీమతికి కావలసిన సామగ్రి రడీ చేసి ఉంచింది. వాటిని గబగబా ప్యాక్ చేసాను.

నిద్రలేక కళ్ళు మంటలు పుడుతున్నాయి. ఓ ప్రక్క ఆకలి. నా పరిస్థితి చూసి వెన్నపూసిన నాలుగు బ్రెడ్ పీసులు జామ్ రాసి అందించింది

శ్రీమతి. జెస్ట్ ఎ మినిట్ అంటూ గబగబా ముఖం కడుక్కుని స్నానం చేసి టిఫిన్ పూర్తిచేసాను. నిద్రలేక వచ్చిన నీరసం తగ్గడానికి క్యాప్సుల్ ఒకటి వేసుకున్నాను. ఈలోగా శ్రీమతి రడీ అయింది. వెంటనే డాక్టర్ గారి దగ్గరకు బయలుదేరాం మధ్యలో ట్యాంక్ ఫుల్ చేయించాను.

అప్పటికే డాక్టర్‌గారు, ఆయన శ్రీమతి రడీగా ఉన్నారు. భారతికి వెనుక సీట్లో స్ట్రెచ్చర్ సహాయంతో పడుకోబెట్టారు సిస్టర్స్. ఆమె ముఖం చూస్తే కొద్దిగా పరవాలేదనిపించి కొత్తవెలుగు కనబడుతుంది. నన్ను దగ్గరకు రమ్మని కళ్ళతో పిలిచినట్లై ''ఏం కావాలి'' అన్నాను.

''నన్ను బ్రతికించడానికి ప్రయత్నిస్తున్నావా!'' అంది నీరసమైన కంఠస్వరంతో.

''నీకేం కాలేదు భారతి.'' అన్నాను.

''నాన్నగారు పోయిన తరువాత ఇంక నాకెవరున్నారు రాహుల్! నేను ప్రేమించిన నిన్ను చేసుకోలేకపోయాను. నన్ను పిచ్చిగా ప్రేమించిన బావని కాదన్నాను. నేను ఎవరికోసం బ్రతకాలి రాహుల్.'' అంటుంటే- అప్పుడు భారతికి బావ గురించి చెప్పాలనిపించింది. కానీ చెప్పడానికి భయంవేసి ఊరుకున్నా.

చలపతిరావుగారి డ్రైవర్ మాతో వస్తున్నాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే రాత్రి నిద్రలేనిదానికి ఈపూట డ్రైవింగ్ నేనైతే చచ్చేవాణ్ణి.

వసంత రుతువులోని వెన్నెల్లా చల్లగా ఉంది అక్కడి వాతావరణం. వాతావరణానికే సగం రోగాలు తగ్గుతాయనిపిస్తుంది.

భారతిని ఎడ్మిట్ చేసిన తరువాత హాస్పిటల్ బయట మేం ఉండటానికి రూమ్ అద్దెకు తీసుకున్నాం. డాక్టర్ గారికి వారి భార్యకు హాస్పిటల్‌లోనే రూమ్ ఎరేంజ్‌మెంట్ ఉండటంవల్ల మేం తాత్కాలికంగా విడిపోయాం.

డాక్టర్ చలపతిరావు గారు ఆరోజు మధ్యాహ్నం నన్ను పిలిపించుకుని వాళ్ళ ఫ్రెండ్స్ అయిన అమెరికన్ డాక్టర్స్‌కి పరిచయం చేసారు. భారతి ఆపరేషన్ సక్సస్‌ఫుల్‌గా నిర్వహిస్తామని హామీ కూడా ఇచ్చారు నా భయం చూసి.

25 రోజులు అక్కడే గడిచిపోయాయి. ఆ ప్రశాంత వాతావరణంలో భక్తి భావనలతో చాలా ఆనందంగా తృప్తిగా మనశ్శాంతిగా గడపగలిగాం. ఆరోజు సాయంత్రం భారతిని డిస్చార్జ్ చేస్తున్నారు. డా. చలపతిరావుగారు ఇంకా వారం రోజులు అక్కడ ఉండవలసి ఉంది. భారతిని తీసుకుని నన్ను వెళ్ళిపొమ్మన్నారు. అప్పటికే డ్రైవర్ ఆరోగ్యం బాలేదని వెళ్ళిపోయాడు. రిటన్‌లో నేనొక్కడిని డ్రైవ్ చెయ్యవలసిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు టెన్షన్స్ తగ్గినాయి కాబట్టి డ్రైవ్ చెయ్యగలనన్న ధైర్యం వచ్చింది.

ఆఖరిసారిగా సాయిబాబాని దర్శించి బయలుదేరాం. భారతి ఇప్పుడు మామూలు మనిషి అయింది. ఇదివరకటి కళ ఆమె ముఖంలో సంతరించుకొంటుంది.

రాత్రి 9 గంటలు అవుతుండగా డిన్నర్ కోసం ఓ హోటల్ వద్ద ఆగాం. భారతి వెనుకసీటులో పడుకుని ఉంది. ఆమెకు కావలసిన ఫుడ్ వెంట తెచ్చుకున్నది ఉంది.

శ్రీమతికి ఏం కావాలి అన్నాను. నాకు టిఫిన్ చాలు మీరు భోజనం చేసి వచ్చేయండి. నేను భారతికి తోడుగా ఇక్కడే ఉంటానంది. శ్రీమతి వెంట రానందుకు చాలా సంతోషం కల్గింది. దాదాపు 4 నెలలుపైనే అయింది ఓ పెగ్గైనా పుచ్చుకుని.

గబగబా బార్‌లో దూరి 2 పెగ్గులు సిప్‌చేసి డిన్నర్ ముగించి శ్రీమతికి కావలసిన ఫుడ్ ప్యాక్ చేయించాను. రెండు కిళ్ళీలు కూడా కట్టించాను.

భారతికి డిస్టబెన్స్ అని సిగరెట్ తాగి చాలాసేపయింది. ఎంతో హాయి అన్పించింది కిళ్ళీ వేసుకుని సిగరెట్ పీలుస్తుంటే.

శ్రీమతి వ్యాన్‌లోనే టిఫిన్ తినడం ముగించింది. డ్రైవ్ చెయ్యగలరా? నేను చెయ్యనా అని అడిగిందప్పుడు. అప్పటివరకూ శ్రీమతికి డ్రైవింగ్ వచ్చని నాకు తెలియదు. డ్రైవింగ్ కాంపిటీషన్‌లో గోల్డ్‌మెడల్ కొట్టేసిందట బెంగుళూరులో చదువుతున్నప్పుడు.

నేను రిలాక్స్‌గా ప్రక్కన కూర్చుంటే ఆమె డ్రైవ్ చెయ్యసాగింది. రాత్రి 12 గంటలు దాటుతుండగా నేను నిద్రలోకి జారుకున్నాను.

ధడేల్‌మన్న శబ్దం విన్పించడంతో నా నిద్రమత్తు వదిలింది. అప్పటికే మా వ్యాను పల్లంలోకి జారుతుంది. శ్రీమతి కంగారుగా కంట్రోల్ చెయ్యడానికి ప్రయత్నిస్తుంది. ఆమె చేతుల్లోని స్టీరింగ్ నా చేతుల్లోకి తీసుకుని జాగ్రత్తగా కంట్రోల్ చేసి ఆపగలిగాను. బ్రేక్ మీద కాలు తీస్తే పల్లంలోకి జారిపోయేలా ఉంది. మెల్లగా క్రిందికి దిగి రెండు రాళ్ళు ఏరి టైర్లక్రింద పెట్టమని శ్రీమతికి చెప్పాను. శ్రీమతి వేగంగా చెప్పినపని పూర్తి చేసింది.

భారతి పరిస్థితి ఎలా వుందా అని వెనక్కు తిరిగి చూసాను. ఆమె మత్తుమాత్రల వల్ల గాఢంగా నిద్రపో

తుంది. వ్యాన్ సేఫ్ పొజిషన్‌లో ఉందనిపించిన తరువాత మెల్లగా దిగి భారతిని లేపి క్రిందకు దింపాను.

వేన్‌ని పైకి నెట్టడం కోసం సహాయంగా ఎవరైనా వస్తారని ఎదురుచూస్తున్నాం. అప్పుడు గుర్తువచ్చింది మమ్మల్ని గుద్దిన కారు సంగతి. వెనక్కు తిరిగి చూసాను. దగ్గరలోనే చెట్టుకు గుద్దుకుని ఉంది. గబగబా అటువైపు నడిచాను. కారులోనుండి సన్నగా మూలుగుతున్న శబ్దం వినిపిస్తుంది. గబగబా డోర్ ఓపెన్ చేసి డ్రైవింగ్ సీటులో ఉన్న మొండి చెయ్యి వ్యక్తికి బయటకు లాగాను.

సింగిల్ హాండ్‌తో డ్రైవ్ చేస్తున్నాడా, మణికట్టువరకూ తెగి ఉన్న చేతికి కట్టు కట్టి ఉంది. అప్పుడు గుర్తుకు వచ్చాడు భారతి బావ. వెంటనే శ్రీమతిని పిల్చాను. మాసిన గడ్డంతో రక్తం ఓడుతున్న శరీరంతో ఉన్న బావని గుర్తుపట్టింది.

అర్జంటుగా హాస్పిటల్‌కి చేర్చాలి బావను అంది. అంతలో ఓ లారీ రావడంవల్ల సహాయంతో వ్యాన్‌ని బయటకు లాగటం జరిగింది. మూడు కిలోమీటర్ల దూరంలో హాస్పిటల్ ఉందని చెప్పారు వాళ్ళు.

భారతిని వెనుకసీట్లో, దేవ్‌ని మధ్యసీట్లో పడుకోబెట్టి డ్రైవింగ్ తీసుకున్నా. సారీ, అంది శ్రీమతి నావంక చూస్తూ. ''నీ డ్రైవింగ్‌లో ఏం ఫాల్ట్ లేదు డియర్'' అన్నాను.

అదృష్టంకొద్దీ ఆ ఊళ్ళో డే అండ్ నైట్ తెరిచి ఉంచే మెడికల్ షాపు కన్పించింది. కౌంటర్‌లో కునుకుతున్న వ్యక్తిని నిద్రలేపి నన్ను పరిచయం చేసుకున్నాను. దగ్గరలోనే హాస్పిటల్ ఉందిసార్! ఆ సందులో చివర మెడికల్ అసోసియేషన్ తరపున కట్టిన గెస్ట్‌హౌస్ కూడా ఉంది సార్!'' అన్నాడు వినయంగా.

వెంటనే హాస్పిటల్‌కి పోనిచ్చాను వ్యాన్. డాక్టర్స్ ఎవరూ ఈ టైమ్‌లో ఉండరని తెలుసు. కనీసం ప్రథమ చికిత్స అయినా చేయించవచ్చు అనుకుంటూ లోనికి వెళ్ళాను. ఇన్ పేషెంట్స్ చాలా తక్కువగా ఉన్నట్లున్నారు. పెద్దగా హడావుడి లేదు. హెడ్ నర్స్ కుర్చీలో కూర్చుని గురకపెడుతుంది. ఆమెను మెల్లగా పిలిచాను. కంగారుపడుతూ లేచిందామె! సారీ ఫర్ ది డిస్టర్బెన్స్ అంటు నన్ను నేను పరిచయం చేసుకున్నాను. మీరు ట్రీట్‌మెంట్ మొదలుపెట్టండి. పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చి వెంటనే వస్తానని ఆమె సహాయంతో దేవ్‌ని బెడ్‌మీదకు చేర్చాము.

శ్రీమతిని అక్కడే ఉండమని భారతిని తీసుకుని గెస్ట్ హౌస్‌కి వెళ్ళాను ముందు. అరగంట తర్వాతగానీ వాచ్ మాన్ లేవలేదు. క్లర్క్‌ని నిద్రలేపి డబుల్ రూం తీసుకున్నాను. భారతిని రూంలోనే ఉండమని బయట లాక్ చేసుకుని వాచ్‌మాన్‌ని తీసుకుని పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళాను.

నైట్ డ్యూటీలో ఉన్న ఎస్.ఐ. నా రిపోర్ట్ స్వీకరించి నావెంట హాస్పిటల్‌కి కానిస్టేబుల్‌ని పంపించారు. దేవ్ చెప్పిన రిపోర్ట్ రాసుకుని అతను వెళ్ళిపోయాడు.

రెండు రోజులకు దేవ్ కొద్దిగా కోలుకున్నాడు. మూడవరోజు సాయంత్రం డిస్చార్జ్ చేసారు దేవ్‌ని. అప్పటికే భారతి అడుగుతుంది మనం ఇక్కడ ఎందుకు స్టే అవ్వవలసి వచ్చిందని. దేవ్‌ని గెస్ట్‌హౌస్‌కి తీసుకువచ్చాము. రేపు ఉదయం బయలుదేరడానికి నిశ్చయించుకున్నాము.

అప్పుడే బాత్‌రూంలో నుండి బయటకు వచ్చిన భారతి మంచం మీద పడుకున్న బావని చూసి నిర్ఘాంతపోయింది. మొండి చెయ్యి, వంటి నిండా కట్లతో ఉన్న దేవ్‌ని అర్థంకానట్లు చూస్తూ. ఏమిటి అన్నట్లు నావంక చూసింది. నేను శ్రీమతి సమాధానం చెప్పకుండా రూమ్‌లోంచి బయటకు వచ్చి హాల్‌లో కూర్చున్నాం.

భారతి వెంటనే బయటకు వచ్చేసి నా ఎదురుగా నిలబడింది. ఆమె కళ్ళల్లో కోపాన్ని గమనించి నేనేం మాట్లాడలేదు. వాడివల్లే నాన్న ప్రాణం బలవంతంగా తీసుకున్నారు. మళ్ళీ ఎందుకు వాణ్ణి తీసుకువచ్చారు అంది భారతి.

భారతి ప్లీజ్ కూల్‌డౌన్... నే చెప్పేది కాస్త ప్రశాంతంగా విను. కొంతకాలం వరకు నువ్వు టెన్షన్స్‌కి దూరంగా ఉండాలి అని డాక్టర్స్ చెప్పలేదూ! అంటూ ఆమెను సోఫాలో కూర్చోమన్నట్లు సైగ చేసాను.

బావ నిన్ను పిచ్చిగా ప్రేమించాడు భారతీ. నీమీద కోపంతో నాన్నని ఏదో చేసాడు. కానీ నీ జబ్బు విషయం తెలియగానే తను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా చేతిని నరుక్కున్నాడు.

నిన్ను తీసుకుని పుట్టపర్తి బయలుదేరిన రోజే మీ మామయ్య బెంగుళూరు నుండి ఫోన్ చేసారు. 'నిన్ను ఒక్కసారైనా చూసి వాడు చచ్చిపోతానంటున్నాడు. నువ్వెక్కడున్నావో తెలియపరచమని.' నీ పరిస్థితి అప్పటికి చాలా సీరియస్‌గా ఉండటంవల్ల నీకు తెలియనివ్వలేదు.

నిన్ను వెతుక్కుంటూ వచ్చి దారిలో మన వ్యాన్‌కి డాష్ ఇచ్చి మరింత గాయాలపాలైనాడు. ఈ రెండు రోజులు బావకి ట్రీట్‌మెంట్ చేయించడం కోసం ఇక్కడ స్టే అయ్యాం'' అన్నాను.

''మీ బావ విషయంలో నిర్ణయం నువ్వే తీసుకో! నా సలహా మాత్రం నన్ను వదిలివేసినంత తేలిగ్గా అతన్ని వదలవద్దని. నీ కోసం ఎంత త్యాగానికైనా సిద్ధపడే నీ బావ నాకంటే ఉత్తముడుగా కనబడుతున్నాడు. అతని ప్రేమని గుర్తించు'' అన్నాను.

తేలికైన హృదయంతో దేవ్ ఉన్న రూమ్‌వైపు వెళుతోంది భారతి. ఆమె ముఖంలో కన్పించిన వెలుగు ఎప్పటికీ మరచిపోలేను. ★

## తల వూపితే...

ఇంచుమించుగా ప్రపంచంలోని అన్ని చోట్లా, ఎవరైనా తలవూపితే, దానికి అర్థం- అతను తన అంగీకారం తెలుపుతున్నాడని. అవునా? అయితే, బల్గేరియాలో మాత్రం అలా తల వూపితే దానికి అర్థం- అంగీకరించడం లేదని. ఇదేదో తలతిక్క వ్యవహారంలాగా ఉంది గదూ?!

## 49 మంది పిల్లలు

ఆయనగారి పేరు సలీమ్ జుమాముంబారక్. 52 సం.రాల వయస్సు గల అతనికి 49 మంది మాత్రమే సంతానం. అతను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉంటున్నాడు. మొదట్లో 60 మంది సంతానం కోసం అతను ప్లాన్ చేశాడు. అయితే, 49 మంది తర్వాత, ఇంక పిల్లలు చాలనుకున్నాడు. అంతకు మించితే, తానిక వారిని పోషించలేనని అన్నాడు. నయమే, ఇప్పటికైనా కళ్లు తెరిచాడు సుమా!

## పాములు పట్టే ఉద్యోగం

మునిసిపాలిటీవారు అనేక చోట్ల ఉన్నట్టుండి అనేక తమాషాలను చేసేస్తూ ఉంటారు. అటువంటిదే భోపాల్ మ్యునిసిపల్ కార్పొరేషన్‌వారు చేసిన పని. వారికెందుకనో సర్పాలమీద తీవ్రమైన కోపం వచ్చింది. వెంటనే, ఓ పాములను పట్టే వ్యక్తికి ఉద్యోగం ఇచ్చేశారు. పాములను పట్టడం, చంపడం అతని పని. అంతేకాక, పాముకాటుకు గురి అయిన వారికి వైద్యం కూడా అతనే చెయ్యాలి. ఇంతకీ ఆ సర్పాల సత్తెయ్యకు వైద్యం వచ్చునోలేదో, కార్పొరేషన్ వారికి తెలియదు.

- కొడిమెల

